బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



కాచిగూడ అభినందన్ గ్రాండ్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య. గుజ్జ కృష్ణ

జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ లాల్ కృష్ణ అధ్యక్షతన కాచిగూడ లోని అభినందన్ గ్రాండ్‌లో శుక్రవారం 13 బీసీ సంఘాలు, 30 కుల సంఘాల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆర్.కృష్ణయ్య ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే వచ్చే జూన్ నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సూచనప్రాయంగా ప్రకటించిందన్నారు. బీసీలకు రిజర్వేషన్లు పెంచకుండా స్థానిక సంస్థల ఎన్నికలు ఎలా నిర్వహిస్తారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీ రిజర్వేషన్లను 20 శాతం నుంచి 42 శాతంకు పెంచిన తరువాతే ఎన్నికలు నిర్వహించాలన్నారు. రిజర్వేషన్లు పెంచకుండా ఎన్నికలు నిర్వహిస్తే బీసీల తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, నీల వెంకటేష్, వేముల రామకృష్ణ, దానకర్ణచారి, కోల జనార్ధన్, నందగోపాల్, ప్రణీత రాణి, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప సంఘ సంస్కర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి



వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్



పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో పాల్గొన్న మధుసూదన చారి

కవాడిగూడ: విశ్వంలో జరిగే పరిణామాలను తన దివ్య దృష్టితో ముందుగానే తెలియజేసిన మహనీయుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని ఎమ్మెల్సీ, మాజీ స్పీకర్ మధుసూదనాచారి అన్నారు. శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 331వ ఆరాధాన మహోత్సవాన్ని శుక్రవారం విశ్వ కర్మ ఫౌడేషన్ ఆధ్వర్యంలో ట్యాంక్‌బండ్‌పై పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన మధుసూదనా చారి, బీసీ కులసంఘాల జేఏసీ చైర్మన్ కుందారపు గణేష్‌చారీలు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కాలజ్ఞానం బోధించి సకల జనుల హితం కోరిన గొప్ప సంఘ సంస్కర్త, భవిష్యత్ దర్శి శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అని కొనియాడారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధానోత్సవాలు

అంబర్‌పేట: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి 331 ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరిగాయి. శుక్రవారం విశ్వబ్రహ్మణ సమైక్య సంఘం ఆధ్వర్యంలో అంబర్‌పేట డివిజన్ అన్నపూర్ణనగర్ కాలనీలో వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను సత్కరించారు. సంఘం నాయకులు జయన్‌కుమార్ చారి, రామాచారి, శ్రీకాంత్‌చారి, ఆనంద్‌చారి, కృష్ణచారి పాల్గొన్నారు.

ప్రజలను చైతన్యపర్చిన బండి యాదగిరి



మాట్లాడుతున్న సిరికొండ మధుసూదనాచారి, జనార్ధనమూర్తి తదితరులు

చిక్కడపల్లి: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు బండి యాదగిరి అని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కొనియాడారు. శుక్రవారం రాత్రి త్యాగరాయగానసభ నిర్వహణలో ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, విప్లవ కవి బండి యాదగిరి యాదిలో శీర్షికతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. బండెనక బండి కట్టి పాటను రాసి ప్రజలను ప్రభావితం చేసి ఉద్యమంలో పాల్గొనేలా చైతన్యపరిచారన్నారు. బండి యాదగిరి , సుద్దాల హనుమంతు వంటి కవులు, కళాకారులు సాయుధ పోరాటానికి మద్దతు కూడగట్టి విజయం సాధించరన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో సాయిధ పోరాటానికి మద్దతు కూడగట్టి విజయం సాధించారన్నారు. ప్రముఖులు తంగిరాల చక్రవర్తి, శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, గరిమెళ్ల సీత తదితరులు పాల్గొన్నారు.

అమరులు, ఉద్యమకారుల కుటుంబాలకు న్యాయం చేయాలి



మాట్లాడుతున్న బోర్గి సంజీవ్

తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు బోర్గి సంజీవ్

పంజగుట్ట: ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి కూలీలకు, నిరుపేదలకు ఎమ్మెల్యే టిక్కెట్లు ఇచ్చి గెలిపించుకుంటుంటే తెలంగాణలో మాత్రం అన్ని పార్టీలు గెలుపు గుర్రాల పేరుతో వందల కోట్లు ఉన్న ఎన్ఆర్‌ఐలకు ఇచ్చుకుంటున్నాయని తెలంగాణ ఉద్యమకారుల హక్కుల ఫోరం వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.బోర్గి సంజీవ్ అన్నారు. తాను పోలీస్ కానిస్టేబుల్‌గా ఉండి 2013 అక్టోబర్ 13న స్వయానా అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డికి వ్యతిరేకంగా అసెంబ్లీలో పోలీస్ డ్రస్‌లో ఉండి జై తెలంగాణ అని నినాదాలు చేశానని గుర్తుచేశారు. పోలీస్ విధుల్లో ఉండి తెలంగాణ తల్లి విగ్రహం పెట్టానని తనను సర్వీస్ నుంచి రిమూవ్ చేశారని, అంతే కాకుండా సంగారెడ్డి జైలుకు తరలించారని గుర్తుచేశారు. ఉద్యోగం పోగొట్టుకుని, ఇంత పోరాటం చేసిన తమ లాంటి ఉద్యమకారులకు, 1200 మంది అమరవీరులకు తెలంగాణ వచ్చిన తర్వాత దక్కింది ఏమీలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... అమరుల త్యాగం మూలంగా, ఉద్యమకారుల పోరాటం ఫలితంగా తెలంగాణ ఏర్పడిందని కానీ ఉద్యమ పార్టీ అయిన టీఆర్ఎస్ ప్రభుత్వంలో, ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉద్యమకారులకు, అమరులకు ఒరిగింది ఏమీ లేదన్నారు. కనీసం ఉద్యమకారులపై పెట్టిన కేసులు కూడా ఎత్తివేయక పోవడం బాధాకరమన్నారు. ఉద్యమకారులకు ఎమ్మెల్యే, ఎంపీ, నామినేటెడ్ పోస్టుల్లో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు త్వరలోనే ముఖ్యమంత్రిని కలిసి వినతిపత్రం ఇస్తానని తెలిపారు. సమావేశంలో కురుమయ్య, ఎస్.కె.అహ్మద్, ఎస్.కె.చాంద్‌పాషా, కార్తికుమార్ తదితరులు పాల్గొన్నారు.

అదుర్స్.. వియోన మేధస్సు



వియోనాకు సర్టిఫికెట్‌ను అందజేస్తున్న దృశ్యం

లాలాపేట: సరిగ్గా మాటలు సైతం రాని ఓ చిన్నారి తన మేధస్సుతో అదుర్స్ అనిపించి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించింది. సదాసివపేటకు చెందిన సుమన్ (యుకే లండన్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరు),రేఖ దంపతుల తొమ్మిది నెలల కుమార్తె బేబీ వియోన తన మేధస్సుతో రకరకాల వస్తువులు, జంతువులు, పక్షులు, పండ్లు, కూరగాయల బొమ్మలు, ఆకారాలు, రంగులు ఇలా సుమారు 100 నుంచి 150 వరకు ఫ్లాష్ కార్డ్స్‌లో అడిగిన పేర్లను అడిగిన వెంటనే ఇట్టే గుర్తు పట్టి చూపిస్తుంది. పిన్న వయస్సులోనే పలు రకాలైన వస్తువులను గుర్తిస్తున్న బేబీ వియోన మేధాశక్తిని పరిగణలోకి తీసుకుని తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో పేరు నమోదు చేస్తున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డా. చింతపట్ల వెంకటాచారి తెలిపారు. దీనికి సంబంధించిన రికార్డు సర్టిఫికెట్‌ను మెయిల్ ద్వారా డిజిటల్‌గా పంపించారు. దీన్ని లండన్‌లో బ్రాక్నెల్ సిటీ కౌన్సిలర్ గ్రాంట్ స్ట్రుడ్లే చేతుల మీదుగా చిన్నారికి సర్టిఫికెట్‌ను అందజేశారు. అతిచిన్న వయస్సులోనే తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించడంపై బేబి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

చెరువును తలపిస్తున్న పార్కు



సుందరయ్య పార్కులో వర్షపు నీటితో నిండిపోయిన వాకింగ్ ట్రాక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో ప్రతిష్ఠాత్మకమైన సుందరయ్య పార్కు గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి చెరువును తలపించేలా మునిగిపోయింది. వాకర్స్ నడిచేందుకు కూడా వీలు కాకుండా వాకింగ్ ట్రాక్ నీటితో నిండిపోయింది. గత ఏడాది కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టి పార్కును ఆధునీకరించినప్పటికి వర్షం నీరు సక్రమంగా ఇంకిపోవడానికి మరమ్మత్తులు చేపట్టకపోవడం పలు విమర్శలకు దారి తీసింది. ఇన్ని లక్షలు ఖర్చు చేసి వర్షపు నీరు పోవడానికి సరైన ఏర్పాట్లు చేయకపోవడం విచారకరమని వాకర్స్ వాపోతున్నారు. వర్షం వచ్చిన ప్రతి సారీ పార్కులోని వాకింగ్ ట్రాక్ నీటితో నిండిపోయి బురద మయం కావడంతో వాకర్స్ ఇక్కట్లకు గురవుతున్నారు. పార్కుకు వచ్చే వారు, యోగా చేసే వారు నానా ఇబ్బందులకు గురవుతున్నారు. వచ్చేది వర్షాకాలం కావడంతో ఇంకా ఎంత ఇబ్బందులకు గురికావాల్సి వస్తుందో అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీకి సంబంధించిన డీఎంసీ, డిప్యూటీ డైరెక్టర్, ఏఈ తదితర అధికారులు పార్కు వైపు కూడా కన్నెత్తి చూడకపోవడం విచారకరమని వాకర్స్ వాపోతున్నారు.

19న మెగా ఉచిత వైద్య శిబిరం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రపంచ ఫ్యామిలీ డాక్టర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 19న బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. శిబిరంలో ప్రముఖ వైద్యులు వైద్యసేవలందిస్తారు.

పురోహితులకు ఎమ్మెల్యే ఆర్థిక చేయూత



పురోహితులకు ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

అంబర్‌పేట: పేద పురోహితులకు చేయూతనివ్వడం ఎంతో సంతృప్తినిస్తుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ తెలిపారు. అంబర్‌పేట నియోజకవర్గంలో వివిధ ఆలయాల్లో నిత్య పూజాలు చేసే 11 మంది పురోహితులకు ఆయన శుక్రవారం వ్యక్తిగతంగా ఒక్కొక్కరికి రూ.5 వేలు అందించారు. ఈ సందర్భంగా పురోహితులు ఎమ్మెల్యేకు వేద ఆశీర్వచనం అందించారు.

నాణ్యతతో అభివృద్ధి పనులు చేపట్టాలి



డ్రైనేజీ నిర్మాణపు పనులను పర్యవేక్షిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: అభివృద్ధి పనులను నాణ్యతో చేపట్టాలని కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. నింబోలిఅడ్డ లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ పైపులైన్ నిర్మాణపు పనులను కార్పొరేటర్ శుక్రవారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు మల్లికార్జున్, రమాదేవి, వెంకటేష్, ఆర్.సంతోష్, ఎస్. రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

'వీసీ తీరు సరికాదు'

ఉస్మానియా యూనివర్సిటీ: పీఆర్‌సీ అమలుపై వీసీ ప్రొ.రవీందర్ అనుసరించిన తీరుపై ఔటా (ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్) అధ్యక్షులు ప్రొ.మనోహర్ మండిపడ్డారు. నాలుగు రోజుల్లో ముగియనున్న తన పదవీ కాలాన్ని దృష్టిలో పెట్టుకొని నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ అనుమతి లేకున్నా 2016 నుంచి వీసీ ప్రొ.రవిందర్ పీఆర్‌సీ బకాయిలను విడుదల చేయించుకోవడం దారుణమన్నారు. వేతన బకాయిలను 2016 నుంచి జూన్ 2019 వరకు ఉ ద్యోగ విరమణ పొందిన అధ్యాపకులకు మాత్రమే చెల్లించనున్నట్లు ఉత్తర్వులు జారీ చేయడం వెనుక వీసీ స్వార్థం ఉందన్నారు. అందరి బాగోగులు చూడాల్సిన వీసీ వ్యక్తిగత ప్రయోజనాల కోసం పని చేయడం దారుణమన్నారు. పీఆర్‌సీని అందరికి వర్తింపజేయాలని లేని పక్షంలో ఆందోళనకు దిగుతామని ప్రొ.మనోహర్ హెచ్చరించారు.

ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

అబిడ్స్: ఉద్యోగుల సంక్షేమానికి రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని తెలంగాణ ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ చిన్నారెడ్డి పేర్కొన్నారు. దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. జీహెచ్ఎంసీ మున్సిపల్ సహకార్ మజ్దూర్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఆదిల్ షరీఫ్ ఆధ్వర్యంలో చిన్నారెడ్డిని ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యలను ఆయనకు వివరించారు. యాదగిరి, మహ్మద్ రఫీ, జహీరుద్దీన్ ఆదిల్ షరీఫ్‌తో కలిసి చిన్నారెడ్డిని సన్మానించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో శనివారం ఉదయం 6 గంటల నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు ఏడిఈ విజయ్‌భాస్కర్ తెలిపారు.

- అహోబిల్‌మట్ ఫీడర్ పరిధిలో ఏటిఐ, లైఫ్ ఆసుపత్రి, ఆంధ్రాబ్యాంక్, హోటల్ మెనేజ్‌మెంట్ తదితర ప్రాంతాల్లో 6 గంటల నుంచి 6.30 వరకు
- సాయిబాబా టెంపుల్ ఫీడర్ పరిధిలో శివం, సాయిబాబా కమాన్, వీహెచ్‌హౌజ్, జామాయి ఉస్మానియా ఫీడర్ పరిధిలో జామాయి ఉస్మానియా, ఎస్‌బీహెచ్ కాలనీ, అంబర్‌నగర్, అడిక్‌మెట్ ఫ్లై ఓవర్ తదితర ప్రాంతాల్లో 6.30 నుంచి 7 వరకు
- వైఎంసీఏ ఫీడర్ పరిధిలో నారాయణగూడ బ్లెడ్‌బ్యాంక్, లింగంపల్లి, నూపతుంగా కాలేజ్, అయ్యప్ప టెంపుల్ ఫీడర్ పరిధిలో సాయిదత్త నర్సింగ్‌హోమ్, టెలిఫోన్ ఎక్స్ చేంజ్, మల్లికార్జుననగర్, ఎరుకల బస్తీ తదితర ప్రాంతాల్లో, శ్రీరామ్‌నగర్ ఫీడర్ పరిధిలో అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, ఫీవర్ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో 7 గంటల నుంచి 8 గంటల వరకు
- ఆప్కో ఫీడర్ పరిధిలో నారాయణగూడ వాటర్ వర్క్స్, కెనరా బ్యాంక్, శాంతి థియేటర్, విఠల్‌వాడీ, తెలంగాణ టూరిజం, తెలుగు అకాడామీ, ఇంద్రానగర్ ఫీడర్ పరిధిలో కిషన్‌రావు ఆసుపత్రి, తిలక్‌నగర్ బ్రిడ్జి, ఇందిరానగర్ తదితర ప్రాంతాల్లో 8 గంటల నుంచి 8.30 వరకు
- పటేల్ నగర్ ఫీడర్ పరిధిలో పటేల్‌నగర్, అంబేద్కర్‌నగర్, ఆజాద్‌నగర్, దుర్గానగర్ తదితర ప్రాంతాల్లో 8.30 నుంచి 9 గంటల వరకు
- తిలక్‌నగర్ పరిధిలో తిలక్‌నగర్, చే నెంబర్ క్రాస్ రోడ్, అంబర్‌పేట మెయిన్ రోడ్డు తదితర ప్రాంతాల్లో 6.30 నుంచి 8.30 విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

ఉద్యోగులకు గ్యారంటీ పథకాలను అమలు చేయాలి



అబిడ్స్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు ఇస్తున్న ఆరు గ్యారంటీ పథకాల తరహాలో ఉద్యోగులకు గ్యారంటీ పథకాలు ప్రవేశపెట్టాలని టీఎన్జీఓస్ యూనియన్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎస్ఎం.ముజీబ్ హుస్సేని పేర్కొన్నారు. శుక్రవారం గృహకల్ప కార్యాలయంలో జరిగిన హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన ఆయన పాల్గొని ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న డీఏ, 2023 పీఆర్‌సీ, హెల్త్ కార్డులు, పెండింగ్ మెడికల్ రియింబర్స్‌మెంట్ బిల్లులు, జీపీఏకు బిల్స్, సరెండర్ లీవ్ బిల్స్‌లను ప్రభుత్వం వెంటనే విడుదల చేసి లక్షలాది మంది ఉద్యోగులకు అండగా నిలవాలని ఆయన అన్నారు. ఉద్యోగుల సంక్షేమం కోసం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతుందన్నారు. తాను కూడా ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ఇతర ఉన్నతాధికారుల దృష్టికి ఉద్యోగుల సమస్యలు ఎప్పటికప్పుడు తీసుకువెళ్తున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో హైదరాబాద్ జిల్లాలోని 45 యూనిట్ల అధ్యక్షులు, కార్యదర్శులతో పాటు జిల్లా కార్యదర్శి విక్రమ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షులు కేఆర్. రాజ్‌కుమార్, ఉమార్‌ఖాన్, కుర్రాడి శ్రీనివాస్, నరేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు



రామంతాపూర్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై ఆసక్తి పెంచుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగవచ్చునని రామంతాపూర్‌లోని షిప్స్ జూనియర్ కళాశాల చైర్మన్ శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ రాజారెడ్డి అన్నారు. ఇటీవల ప్రకటించిన సీనియర్ జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో ప్రతిభ అత్యధిక మార్కులు సాధించిన జి.వైష్ణవి కావ్య, సమీరా జోనాథ్, దీపిక, వర్ష, అంజలి, సింధూజ, పవన్, వశిష్ఠ, భవాని, రాజేశ్వరి తదితర విద్యార్థులను శుక్రవారం వారు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ.. తమ కళాశాలలో ప్రతియేటా ఉత్తమ ఫలితాలు సాధించేందుకు అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధిస్తున్నామన్నారు.

ప్రోటోకాల్ ఆధారిత విధానంతో డెంగీ చికిత్సలు



అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రోటోకాల్ ఆధారిత విధానంతో గర్భిణులకు ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో డెంగీ చికిత్సను నిర్వహిస్తున్నామని ఫెర్నాండెజ్ ఆసుపత్రి చీఫ్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ తారకేశ్వరీ తెలిపారు. అబిడ్స్‌లోని ఫెర్నాండెజ్ ఆసుపత్రిలో ఆమె మాట్లాడుతూ..జూన్ నుంచి నవంబర్ వరకు వర్షాకాలంలో సంభవించే ప్రధాన ఆరోగ్య సమస్య డెంగీ అని అన్నారు. డెంగీ జ్వరంతో గర్భిణులలకు ఎలాంటి ఇబ్బందులు కాకుండా వారిని సురక్షంగా ఉంచేందుకు ఆసుపత్రిలోని మల్టీ డిసిప్లేనరీ బృందాలచే ప్రోటోకాల్ ఆధారిత విధానాన్ని అమలు చేసి డెంగీ నివారణ చేస్తున్నామన్నారు. గత ఐదు సంవత్సరాల్లో తమ ఆసుపత్రిలో 300 కేసుల్లో ఎలాంటి సమస్యలు లేకుండా డెంగీ నివారణను విజయవంతంగా నిర్వహించామన్నారు. ఫెర్నాండెజ్ ఆసుపత్రి స్థాపించబడిన మార్గదర్శకాలను అనుసరించడంతో పాటు సమర్థవంతమైన నివారణ, నిర్వహణ, వ్యూహాలను అమలు చేయడంతో తల్లులు, వారి శిషువులు ఆరోగ్యంగా ఉంటున్నారని పేర్కొన్నారు.

రైలు ఢీకొని వృద్ధుడి మృతి

అడ్డగుట్ట: పట్టాలు దాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఓ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్ రాజ్ తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం- గుండ్ల పోచంపల్లి రైల్వే స్టేషన్ల మార్గమధ్యలోని పట్టాలపై శుక్రవారం ఉదయం సుమారు 60-65 మధ్య వయస్సున్న గుర్తు తెలియని వ్యక్తి నడుచుకుంటూ వెళ్తున్నాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు తెలుపు రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

రాంగోపాల్‌పేట్: మతిస్థిమితం సరిగా లేని వ్యక్తి తప్పిపోయిన ఘటన గోపాలపురం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం భద్రాచలంకు చెందిన వీరబ్రహ్మం భార్యతో పాటు కుమారుడు శశిధర్ (30)తో కలిసి ఈ నెల 15వ తేదీన నగరానికి వచ్చాడు. శశిధర్‌కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో ఎర్రగడ్డలోని మానసిక చికిత్స కేంద్రంలో చికిత్స తీసుకుంటున్నారు. అదే రోజు గచ్చిబౌలిలోని ఆయన మరో కుమారుడి ఇంట్లో ఉన్నారు. మరోసటి రోజు తండ్రి కుమారుడు ఎర్రగడ్డలోని ఆస్పత్రి చికిత్స కోసం వెళ్లారు. అక్కడి నుంచి దిల్‌సుఖ్‌నగర్‌లో బస్ పాస్ రెన్యూవల్ చేసుకుని అక్కడి నుంచి ఇద్దరూ 107లో సికింద్రాబాద్‌లోని రెతిఫైల్ బస్టాండ్‌కు వచ్చి అక్కడి నుంచి గచిబౌలికి వెళ్లాల్సి ఉంది. రెతిఫైల్ బస్టాండ్ వద్ద ఇద్దరు రోడ్డు దాటుతుండగా శశిధర్ కనిపించలేదు.

అధిక రక్తపోటుపై జాగ్రత్తలు అవసరం

కాచిగూడ: ఉరుకులు..పరుగుల జీవితంలో మనిషి తన ఆరోగ్యాన్ని కాపాడుకోడాన్ని విస్మరిస్తున్నాడని.. అది అత్యంత ప్రమాదకరమని టీఎక్స్ హాస్పటల్స్ డైరెక్టర్లు డాక్టర్ కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజు, రవీంద్ర రామిరెడ్డి అన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం సందర్భంగా శుక్రవారం కాచిగూడలోని టీఎక్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో 3కె వాక్‌థాన్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలకు అధిక రక్తపోటుపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆధునిక జీవన శైలి వల్ల రక్తపోటుకు గురయ్యే వారి సంఖ్య ఎక్కువగా ఉంటోందని, అదే అనారోగ్య సమస్యలకు దారి తీస్తున్నదని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శరత్ చంద్ర, డాక్టర్ సుమీత్ సిన్హా, డాక్టర్ దీపక్ సహా, డాక్టర్ జె.శశి, డాక్టర్ పృధ్వీ, డాక్టర్ అవినాష్ దాల్, డాక్టర్ సోహైల్ సయ్యద్, డాక్టర్ చంద్రకాంత్, శ్రీకాంత్ వోడ్నాల, నవ్య, తదితరులు పాల్గొన్నారు.

23న అన్నమాచార్య జయంతి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వసుంధర, వేమరాజు విజయన్‌కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి

చిక్కడపల్లి: నవ్యనాటక సమితి, అన్నమాచార్య మిషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ తాళ్ళపాక అన్నమాచార్య 616 జయంతి మహోత్సవాన్ని 23న నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థల ప్రతినిధులు వేమరాజు విజయన్‌కుమార్, కామిశెట్టి గోదాలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం చిక్కడపల్లిలోని సమితి కార్యాలయంలో రాష్ట్ర జనాభా లెక్కల శాఖ ఉప సంచాలకులు జి.వసుంధర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. త్యాగరాయగానసభలో జరిగే ఈ కార్యక్రమంలో 11మంది నత్యగురువులు 50 మంది శిష్యురాళ్లతో శ్రీ పదార్చణ శీర్షికతో అన్నమాచార్య సంకీర్తనలకు కూచిపూడి, భరత నాట్య నృత్యరీతులో నృత్య ప్రదర్శన ఇస్తారని తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ పూర్వసలహాదారుడు డాక్టర్ కేవీ రమణాచారి, ప్రముఖులు రజిత్ ఆకుల, డాక్టర్ ఆచార్య ఫణీంద్ర, పద్మినీ మాచాని, పి.విజయకుమార్ తదితరులు హాజరవుతారని తెలిపారు.

వర్షపు ఇబ్బందుల తొలగింపునకు కృషి



బురద, మట్టిని తొలిగిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

అంబర్‌పేట: వర్షంతో స్థానికుల ఇబ్బందులను తొలగించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకుంటామని బాగ్ అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ బి.పద్మా వెంకట్‌రెడ్డి తెలిపారు. కురిసిన వర్షానికి డివిజన్‌లో బతుకమ్మకుంట, సాయిమధురనగర్, శ్రీనివాస్‌నగర్ కాలనీల్లో భారీగా మట్టి, బురద నీరు వచ్చి చేరింది. దీంతో జీహెచ్ఎంసీ సిబ్బంది సహకారంతో జనవాసాల్లో పేరుకుపోయిన బురదనీటిని తొలగించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వెంకట్‌రెడ్డి, స్థానిక బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

కాచిగూడ: అక్రమంగా తరలిస్తున్న 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కాచిగూడ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ హెచ్. నరేష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం... నింబోలిఅడ్డ మౌలానా అజాద్ నగర్ బస్తీకి చెందిన షాహీఉద్దీన్ (26) రేషన్ బియ్యాన్ని అక్రమంగా సరఫరా చేస్తున్నారు. గురువారం రాత్రి అశోక్ లైల్యాండ్ వాహనంలో 9 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు నింబోలిఅడ్డ వద్ద పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 9 క్వింటాళ్ల రేషన్ బియ్యం, వాహనాన్ని స్వాధీనం చేసుకుని, షాహీఉద్దీన్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బియ్యాన్ని సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

కులగణన తర్వాతే 'స్థానిక' ఎన్నికలు నిర్వహించాలి

లిబర్టీ: బీసీల అభివృద్ధి కోసం పాటుపడుతున్న ప్రభుత్వం కులగణన చేసిన తరువాతే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని బీసీ దళ్ జాతీయ అధ్యక్షుడు దుంద్రు కుమారస్వామి కోరారు. రాజకీయంగా వెనుకబడిన బీసీలు అన్ని రంగాల్లో రాణించాలంటే కులగణన చేస్తేనే సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టిన తర్వాతనే బీసీ రిజర్వేషన్‌లను 50 శాతానికి పెంచి స్థానిక సంస్థలు ఎన్నికలు నిర్వహిస్తే ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని ఆయన అన్నారు. బీసీల పక్షపాతిగా ముద్ర వేసుకున్న తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కులగణన చేసేందుకు వెంటనే ఆదేశాలు జారీ చేస్తారని ఆశాభావాన్ని కుమారస్వామి వ్యక్తం చేశారు.

కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మనెంట్ చేయాలి

లిబర్టీ: కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని మున్సిపల్ లేబర్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పని చేస్తున్నా చాలీచాలని జీతాలతో సేవలందిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 140కి పైగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో అనేక సంవత్సరాలుగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపాదికన వివిధ విభాగాల్లో ఉద్యోగులు, కార్మికులు పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని అన్నారు. కనీస వేతనం కూడా వారికి ఉండడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సిద్ధించిన తరువాత తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానం ఉండదని పాలకులు పదేపదే చెబుతున్న రాష్ట్ర సిద్ధించి పదేళ్లు గడిచిన కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయలేదని ప్రీతం సింగ్ అన్నారు. వెంటనే కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా నియమించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రూ.5 లక్షల విరాళం అందజేత

ఉస్మానియా యూనివర్సిటీ: పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కాలజ్ఞాన తత్వంపై ఉపన్యాసం కోసం విశ్వ కర్మ ఫౌండేషన్ అధ్యక్షులు అట్లూరి రవీంద్రాచారి శుక్రవారం ఓయూ వీసీ ప్రొ.రవీందర్‌కు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. సదరు డబ్బులను బ్యాంక్‌లో డిపాజిట్ చేసి వచ్చే వడ్డీతో ప్రతి ఏటా మే 17న వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన దినోత్సవం సందర్భంగా ఆయన పేరు మీద స్మారక ఉపన్యాసం జరిపించాలని కోరినట్లు అట్లూరి రవీంద్రాచారి తెలిపారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి,
వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220383